
# సామెతల కథలు

యామిజాల పద్మనాభస్వామి

## ముగ్గుర్ని కూర్చాడు

ఒక కుటుంబంలోగాని, ఒక సంఘములో గాని విచిత్రవ్యక్తులు కొందరుంటారు. ఎందుకుంటారు? అనే ప్రశ్న వెయ్యడానికి అవకాశం ఉండదు. ఆ విధంగా ఉండడానికి మనం ఒప్పుకోవలసిందే. ఒక కుటుంబాన్ని తీసుకుందాం. ఒకడు మంచి చురుకైనవాడుంటాడు. మరొకడు పరమానందయ్య శిష్యుడులా గుంటాడు. వేరొకడు మధ్య రకంగా ఉంటాడు, వినయ విధేయతలు కలవాడొకడైతే, క్రిందనుంటే పంటా, మీదనుంటే వానలూ ఉండని వాడొకడుంటాడు. అలాగే చదువు సందెలు గలవాడొకడైతే నిద్దురమొగం వాడొకడు. ఒకడు అర్భకుడైతే ఇంకొకడు తిండికి పోతరాజు, పనికి తిమ్మరాజు అవుతూ ఉంటాడు. దీనినే ఇంకొక విధంగా చెప్పవచ్చు. చెప్పవచ్చేమిటి చెప్తూ ఉండడం కద్దు. 'తిండికి తిమ్మరాజు, పనికి పోతరాజు' అని ముఖే ముఖే సరస్వతిగా ఈలాటివి అవతరిస్తూ ఉంటాయి. వాటిని మనం ఒప్పుకోవలసిందే. సమాజములో కలసి తిరుగుతూ జీవించేవాళ్ళం కనక సమాజాన్ని ధిక్కరించి ఒంటిపులిరాకసిలాగా బ్రతకలేము. చూడండి ఉదాహరణకి—

'రాముడికి సీత ఏమవుతుంది?'— అని ఎవడో ఒక 'ప్రబుద్ధుడు' రామాయణమంతా శ్రద్ధగా విని చివరి రోజున వచ్చి భార్యను 'అడిగాడట!' మీకు నేనేమవుతానో రాముడికి సీతా అలాగే అవుతుంది. అని ఆ యిల్లాలు (ఉత్తమ యిల్లాలు కనుక) వ్యంగ్యంగా జవాబిచ్చిందట!— 'నువ్వు నాకేమవుతావు' అని అడిగాడట ఆ బుద్ధిమంతుడు. ఆ ప్రశ్నకి ఆ యిల్లాలు చిరునవ్వుతో 'భార్యనవుతాను' అని సన్నగా అన్నదట! అలాగా? అని వెకిలిగా నోరు విప్పి వింతగా ఆమెను చూస్తూ అన్నాడట ఆ వెర్రి మగడు. ఈలాటి దద్దమ్మ మొగుడు ఉంటాడు. మరి సంఘము కదా! అన్ని రకాల వ్యక్తులూ ఉంటారు సంఘమన్నాక. ఒక పళ్ళతోటలోకి వెళ్ళామంటే అక్కడ కాలకూటం లాంటి పళ్ళూ ఉంటాయి. కొత్త చింతపండువంటివీ అమృతానికి అన్నదమ్ములలాంటివీ ..ఇలా ఉంటాయి ... ఆలాగే సంఘజీవులున్నూ. పశువుల



నవ్వుతున్న పై ఫొటోలోని వ్యక్తి, జ్యోతి పాఠకులనూ, మరెన్నో ఇతర పత్రికల పాఠకులకూ నవ్వుల నందించే కార్టూనిస్ట్ జయదేవ్. ఎస్. జయదేవ్ బాబుగా మద్రాసులోని సర్ త్యాగరాయకాలేజీలో జూవాలజీ లెక్చరరుగా పనిచేస్తున్న యీ కార్టూనిస్టు- లెక్చరర్ ఇప్పుడు డాక్టరు పదాన్ని తన పేరుకు జోడించుకున్నాడు. జూవాలజీలో పి.హెచ్. డి. పొంది డాక్టర్ ఎస్. జయదేవ్ బాబుగా మారిన సందర్భంలో జ్యోతి తన శుభాకాంక్షల నందిస్తోంది నవ్వించే జయదేవ్ కు.

---

మందలో చూడండీ. ముందుకి వెళ్ళితే బుసకొట్టి అంతలేసి కళ్ళతో చూస్తూ కొమ్ములొడ్డి కరవడానికి వస్తాయి కొన్ని పశువులు. వెనుకకు వెళ్లితే రెండు కాళ్లూ మీదికెత్తి పెడేల్న తన్నేవి కొన్ని ఉంటాయి. కొన్ని గోముగా దగ్గరగా వచ్చి మోరమీదికెత్తి నిల్చుంటాయిగోకమని....

పైన చెప్పిన 'దద్దమ్మ' మొగుణ్ణి చూసి అతని గడసరి పెళ్లాం 'వేలుమీద గోరు మొల్చింది వెర్రి మొగుడా వేరుండు' అన్నాదట!....అలాగా! అని పెరటి పంచలో వేరే పొయ్యి పెట్టుకొని వంట చేసుకోడం ఆరంభించాడట ఆ నంగిరి మగడు. 'ప్రారబ్ధం' అంటే ఈలాగే ఉంటుంది. ఇంతకీ రాముడికి సీత ఏమవుతుంది? అనే ప్రశ్న ఎక్కడ పుట్టిందంటారు? మన తెలుగుదేశంలోనే. దీనికి సమాధానాలు టిబెట్టు, సయాం, భూటాన్, ఖోటాన్ వగైరా దేశాలలో ఉన్న రామాయణాలలో ఉన్నాయి. ఎవడో తెలివితక్కువ మగడి ప్రశ్నకి యిలా వ్యాసం కోతికొమ్మమీంచి కొమ్మకి దాట్లు వేసినట్టు వెళుతూంది. ఇక మన కథలోకి వద్దాం. కుటుంబములోగాని, సమాజములోగాని విచిత్రవ్యక్తులు ఉంటారనేది సారం....

ఒక కుటుంబములో ఒక మగపిల్లవాడు ఉన్నాడు. అదొక పల్లెటూరు. వాళ్లు బాగా సరుకూ సప్పరా ఆస్తీ పాస్తీ, గొడ్డు గోదా, గాదె, బోదె ఉన్నవాళ్ళు. అలాటి కుటుంబానికి ఆ పిల్లవాడు ఒక్కడే వారసుడు. వాడికి పెళ్ళి యీడు వచ్చింది. ధనవంతులు కనక పిల్లకోసం వాళ్ళు వెళ్ళడం నామోషీ. ఆడపిల్లవారు పెళ్లికొడుకు కోసం తిరగడం ఆనవాయితీ.

ఒకనాడు ఒక పల్లెటూరునుంచి వీరింటికి పురోహితుడువచ్చాడు. పెళ్లికొడుకుని చూశాడు. ఆయన ఆడపిల్లవారి తరపున వచ్చినవాడు. పెళ్లి మాటలు అయాయి. పెళ్లి నిశ్చయించుకున్నారు. పురోహితుడు పెళ్లి పిల్లగలవాళ్ళతో చెప్పాడు, మంచి

కుటుంబం. సత్రంలాంటి కొంప గాదె, బోదె. గేదె ఉన్నవాళ్ళు. పెళ్లికొడుకు కూడా బాగానే ఉంటాడు. నగ, నట్రా బాగానే పెడతారు—అని. అంతా సంతోషించారు. పిల్లకి కన్నెచెరవిడుతుందని.

ఆచారం ప్రకారం మగపెళ్లివారు తరలివచ్చి ఆడపెళ్లివారి ఊరి వెలుపలి చింతతోటలో దిగారు. ఆ వూరి పేరు 'చింతలపాలెం'. పెళ్లికూతుర్ని సవారీలో కూర్చుండబెట్టి మేళతాళాలతో ఆడపిల్ల వారు తోట సంబరానికి సందడిగా వచ్చారు. పెళ్లికొడుకూ, పెళ్లికూతురూ చెట్టుకింద కంబళీ మీద కూర్చున్నారు. నలుగురూ చూసి మెచ్చుకున్నారు చిలకా గోరింకల్లా ఉన్నారే అని.

అలా ఉండగా పెళ్లికూతురు ఇటూ ఆటూ చూసి 'తింతా తెత్లూ తూతాయి'-అని వింత నవ్వుతో అన్నది. అది విని పెళ్ళికొడుకు "తూతూ తాతీ తాలం వస్తే తూయవా?" అని అన్నాడు. ప్రక్కనే తోట సంబరం నడపడానికి కూర్చున్న పురోహితుడు 'దొండుకి దొండే' అని అన్నాడు. పెళ్లివారిలో ఉన్న ఒక ఆసామీ యీ సరస ప్రసంగం విని.

'ముగ్గుర్నీ కూర్చాడురా ముండ దేవుడూ'—అనగా అందరూ పక్కున నవ్వారు.

దీనిని కాస్త వివరించాలి. పెళ్లి కూతురికి చ, ట, ప, అనే అక్షరాలు పలకని ముద్దనోరు. పెళ్లికొడుక్కి చ. ప, క— అనే అక్షరాలు పలకని ముద్దునోరు. పెళ్లి మాటలు కోసం వచ్చి నిశ్చయించుకుని వెళ్లి వచ్చిన పురోహితుడికి ర, డ— అనే అక్షరాలు పలకవు. అలాటి 'యంబ్రహ్మ' పురోహితుడు. యీలాటి ముద్దనోరు వాళ్ళని ముగ్గుర్నీ కూర్చాడురా ఆ ముండదేవుడూ అని ఒకడు ఆక్షేపణగానో, పరాచికంగానో అన్నాడు.

'చింతా చెట్లూ పూచాయీ—అని పెళ్లి కూతురి మాట.'

'పూచీ కాచీ కాలం వస్తే పుయ్యవా?' అని పెళ్లికొడుకు మాట.

'రొండుకి రొండే'—అంటే ఇద్దరికి యిద్దరూ సరిపోయారు. అని హేళనగా అని తన నోటి లొసుగు బయట పెట్టుకున్నాడు పురోహితుడు.

యీలాటి విచిత్ర వ్యక్తుల కలయిక వల్ల అవతరించింది యీ సామెత.

యీ సామెతకి ఒక పురాణకథతో

**V.G.S. GOLDEN GUIDE**
**Second Edition**
**A.P.P.S.C. iv Group**
రివైజ్డ్ & ఎన్‌లార్జ్‌డ్ ఎడిషన్
1976 ఏప్రిల్
600 పేజీలు — వెల రు. 10-00 లు
గెస్ పేపర్స్ విత్ ఆన్సర్స్ మరియు
జనరల్ నాలెడ్జి తెలుగు మీడియమ్ అండ్ ఇంగ్లీషు మీడియమ్
ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి లీడింగ్ షాపుల్లోను దొరుకును. లేదా ప్రతి ఒక్కింటికి రు. 10-00 లు ఎం. ఓ. చేసిన రిజిస్టర్డ్ పోస్టులో పంపబడును.
**V. G. S. పబ్లిషర్స్**
అమలాపురం—533201.

సంబంధం ఉంది. దానిని సంగ్రహంగా యిస్తున్నాను.

ఒకప్పుడు ముని శ్రేష్ఠుడైన అగస్త్యుడూ, అతని భార్య లోపాముద్ర కాశిని వదిలి 'దక్షిణకాశి' అని ప్రసిద్ధమైన దక్షారామములో నివశిస్తున్నారు. అలా ఉండగా వ్యాసుడు అక్కడికి వచ్చాడు. అగస్త్యుడు వ్యాసుణ్ణి పలకరించి 'కాశి నుంచి యిలా వచ్చావు ఏమి కారణం?' అని అడిగాడు. 'ఏమి చెప్పేది? నాకూ, నా శిష్యులకూ కాశిలో ఏడు రోజులు భిక్ష దొరకలేదు. దానితో నాకు కోపం వచ్చి కాశిని శపించబోయాను. అంతలో ఏభై యేళ్ళ ముత్తైదువ ఎదురుగా వచ్చి శపించకు. మాయింటికి రా నీ శిష్యులతో సహా. భోజనం ఏర్పాటు చేస్తాను'—అని అన్నాది. అందరం భోజనానికి వెళ్లాము. నా జన్మలో అంతవరకు ఆలాటి దివ్యాన్న సంతర్పణ ఎరగను. అందరం తృప్తిగా విందుకుడిచి విశ్రాంతిగా కూర్చున్నాము.

అంతలో విశ్వనాథుడు గౌరీదేవితో వచ్చి 'నీచుడా! నానివాసమయిన కాశిని ఆకలి కోపముతో శపిస్తావా? ఇక్కడ నువ్వు ఉండడానికి యోగ్యుడవుకావు. వెంటనే నానివాసం వదలిపో!' అని గద్దించాడు. అప్పుడు గౌరీదేవి కనికరించి 'అయ్యా! విచారించకు. దక్షారామానికి వెళ్ళు. అక్కడ కాశిలో ఉన్నట్టే నీ ఉనికి ప్రశాంతంగా సాగుతుంది. అని వరమిచ్చినట్టు ఓదార్పుగా పలికింది-'ఇంకేముంది! ఇలా శిష్యులతో కొన్ని ప్రయాణాలు చేసి యిక్కడికి చేరాను' అన్నాడు వ్యాసుడు. యీ ముగ్గురూ కలియడం ఒక పద్యములో చెప్తూ మన కవి సార్వభౌముడు పై సామెతకు ఛందో గౌరవం కలిగించాడు. ఆ పద్యం శ్రీభీమేశ్వరపురాణం— మూడవ ఆశ్వాసములో ఆరవసంఖ్యగలది.

'జగతీ మౌళివతంస భూషణము
విశ్వఖ్యాతముం గాశికా
నగరంబుం బెడబాసి నీకును, జగ
న్మాన్యైక చారిత్రయీ
చిగురుంబోడికి, నాకునుం గటకటా!
చేడ్పాటు వాటిల్లె- ఈ
ముగురిం గూర్చిన ముండ దైవమునకున్
మోమోట లేదో సుమీ!...'

ఈలాగే మన సామెతలు మహా కవుల చేతులలో కావ్య గౌరవం పొందినవి చాలా ఉన్నాయి. పై నెలలో మరి కొన్ని. ★

